క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండ

- మంత్రి మేరుగు నాగార్జున



నాగమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో సోమవారం మృతిచెందిన కొలకలూరి నాగమ్మ మృతదేహానికి పూలమాలతో మంత్రి నివాళులర్పించారు. నాగమ్మ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మంత్రితో పాటు నివాళులర్పించిన వారిలో మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, పార్టీ నాయకులు మాదాసు రాంబాబు, కొలకలూరి విజయ్‌కుమార్, కుమ్మూరి సుధాకర్, ఆనంద్, వజ్రంబాబు, కందుల దానియేలు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ జయంతి



అమ్మవారి ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: లక్ష్మీ జయంతి సందర్భంగా ఒంగోలు నగరంలోని పలు అమ్మవారి దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో వెలసిన శ్రీ రాజరాజశ్రీ అమ్మవారి ఆలయం, బాలాజీరావుపేటలోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, రంగారాయుడు చెరువు దగ్గర గల కంచి కామాక్షమ్మ ఆలయం, కేశవస్వామి పేటలోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానం, సమతానగర్లోని కనకదుర్గ అమ్మవారి దేవాలయం, గద్దలగుంటలోని మహాలక్ష్మి మహాసరస్వతి రాజరాజేశ్వరి దేవస్థానం, కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉదయం ఎనిమిది గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు అర్చన, ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ప్రాకారోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ నాయకుడు మృతి



చెంచయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన దళిత ఉద్యమ నాయకుడు మందా చెంచయ్య (78) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. జిల్లాలో అనేక ఉద్యమాలలో క్రియాశీలకంగా చెంచయ్య పాల్గొన్నారు. హక్కుల సంఘం జిల్లా కమిటీలో కార్యకర్తగా పనిచేశారు. జిల్లాలో అన్యాక్రాంతమైన క్రైస్తవ ఆస్తులపై అలుపెరుగని పోరాటం చేశారు. నైపుణ్యం కలిగిన ట్రాక్టర్ మెకానిక్‌గా, హార్మోన్ వాయించడంలో ఆయనకు ఎంతో పేరుంది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెంచయ్య మృతదేహానికి చావలి సుధాకర్, భీమవరపు సుబ్బారావు, రామకృష్ణ, లలిత కుమారి, విజయ సారధి, ఎల్.వెంకటేశ్వర్లు, నల్లూరి వెంకటేశ్వర్లు, పీటీఆర్ చౌదరి, కరవది సుబ్బారావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఇండ్ల సాగర్, ఎంఏ సాలార్, ఉదయ కుమార్, జగన్‌మోహన్ తదితరులు స్థానిక క్లోపేటలోని ఆయన నివాసానికి తరలివెళ్లి నివాళులర్పించారు.

బాలినేనికి ఎమ్మెల్యే కేపీ ఆహ్వానం



బాలినేనిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ

బేస్తవారిపేట: ఒంగోలులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం కలిశారు. శుక్రవారం గిద్దలూరు నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి రావాలని బాలినేనిని ఆయన ఆహ్వానించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక

- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలోని కేవీ లేక్‌వ్యూలో తూము సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారితో ఆత్మీయంగా మాట్లాడి ఏ సమస్యలున్నా తాను అండగా ఉంటానని గుర్తుంచుకోవాలంటూ భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో పత్తి వెంకటేశ్వర్లు, కుమారి, అడపా కిరణ్, రవికుమార్, మహాలక్ష్మమ్మ, విజయలక్ష్మి, ఈశ్వరి, మౌనిక, గాయత్రి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, గొర్రెపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న రాజస్థానీయులు

బాబా రాందేవ్ ఆలయంలో బాలినేని ప్రత్యేక పూజలు...

ఒంగోలు ఏ–1 ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న బాబా రాందేవ్ ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోలీ పండుగను పురస్కరించుకుని పూజలు చేసిన అనంతరం ఆలయం వద్దకు వచ్చిన రాజస్థానీయులకు బాలినేని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజస్థానీయులు బాలినేనిని ఘనంగా సత్కరించారు. బాబా రాందేవ్, మోహన్, జమల్‌ఖాన్‌తో పాటు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, జిల్లా అధికార ప్రతినిధి కావటి రవికుమార్, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరాంజనేయస్వామి తిరునాళ్లు

- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి మేరుగు నాగార్జున



మేరుగు నాగార్జునకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి 38వ వార్షికోత్సవ తిరునాళ్లను సోమవారం అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు చేసి పొంగళ్లు నివేదించారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున స్థానిక నాయకులతో కలిసి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాగులుప్పలపాడు ఎస్సై బ్రహ్మనాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు.



తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ కాంతులతో ఆలయం

జగన్ పాలనలోనే చల్లగా ఉన్నాం..

- సంతోషంగా చెప్పిన మహిళలు, వృద్ధులు
- ఒంగోలులోని 45, 50 డివిజన్లలో మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమం
- బాలినేని శచీదేవి, శ్రీకావ్యలకు అడుగడుగునా అపూర్వ ఆదరణ



50వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఒంగోలులో బాలినేని వాసన్న అండదండలతో ఐదేళ్లుగా చల్లగా జీవిస్తున్నామని పలువురు మహిళలు, వృద్ధులు ఆనందంగా చెప్పారు. కరోనా సమయంలో వాసన్న తీసుకున్న చొరవ మరువలేమని గుర్తుచేసుకున్నారు. అక్కడ జగన్, ఇక్కడ వాసన్న బాగుంటేనే ఒంగోలు బాగుంటుందని అభిప్రాయపడ్డారు. స్థానిక 45, 50 డివిజన్లలో సోమవారం నిర్వహించిన మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమానికి స్థానికుల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. 50వ డివిజన్‌లో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, 45వ డివిజన్‌లో వారి కోడలు శ్రీకావ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అవ్వా బాగున్నారా, అక్కా ఎలాగున్నారు అంటూ ఆత్మీయంగా ప్రజలతో మమేకమై వారు మాట్లాడారు. మహిళలు ఎంతో ఆప్యాయంగా వారికి స్వాగతం పలికి హారతులు పట్టారు. గత ప్రభుత్వంలో తాము పడిన ఇబ్బందులను, ప్రస్తుతం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రశాంతంగా జీవిస్తున్న విధానాన్ని వారి దృష్టికి తీసుకొచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో నగరంలో అపరిశుభ్రత కారణంగా దోమలు విపరీతంగా పెరిగి దాడిచేసేవని తెలిపారు. నేడు చెత్తబండ్లతో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో చాలా మార్పు వచ్చిందని తెలిపారు. నీళ్లు కూడా సక్రమంగా వస్తున్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో తాము ఇబ్బందులు పడింది లేదని, ప్రశాంతంగా జీవిస్తున్నామని తెలిపారు. తమ కాలనీలో జరిగిన అభివృద్ధిని గతానికి, ఇప్పటికి తాము స్పష్టంగా గమనిస్తున్నామన్నారు. అందువల్ల మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నామన్నారు. గతంలో పరిపాలనలో అనుభవం పేరుతో గద్దెనెక్కిన చంద్రబాబు.. చేసిందేమీ లేదని అందరికీ తెలుసని పలువురు మహిళలు ప్రస్తావించారు. అందరం బాగుండాలంటే వైఎస్సార్ సీపీకి ఓటేయాలని, బాలినేని శచీదేవి కోరారు. నగరంలో అభివృద్ధిపై వాసన్న ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇప్పటికే నగరంలో ఎక్కడెక్కడ ఏం అభివృద్ధి జరిగిందో వివరించామన్నారు. ఇంకా చేయాల్సిన పనులపై కూడా ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు అందుబాటులోకి రావడం, వాటిలో నాణ్యమైన మందులు ఉండటంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందన్నారు. రిమ్స్‌లో కూడా వైద్య సేవలు మెరుగయ్యాయన్నారు. అందరం బాగుండాలి..అందులో మా కుటుంబం కూడా ఉండాలనేదే తమ ఆకాంక్ష అని అన్నారు. మంచి చేశాం కనుకనే ఓటేయమని కోరేందుకు ఇంటింటి ప్రచారం చేపట్టామని, ఇందుకు స్థానికుల నుంచి వస్తున్న ఆప్యాయత, అభిమానం, ఆదరణ తమకు కొండంత బలాన్ని చేకూరుస్తున్నాయని అన్నారు. 50వ డివిజన్‌లో కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, ఆగ్రోస్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలాకుమారి, జల్లిపల్లి సుబ్బులు, మల్లీశ్వరి, మరియమ్మ, కోటేశ్వరి, ధనలక్ష్మి, 45వ డివిజన్‌లో కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, నితిన్‌రెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, పిల్లి శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, రంగిరెడ్డి రామిరెడ్డి, ఉండేల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో పాల్గొన్న బాలినేని ప్రణీత్‌రెడ్డి



హోలీ వేడుకల్లో పాల్గొన్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీరోడ్డు, బండ్లమిట్ట ప్రాంతాల్లో సోమవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీరోడ్డులోని పత్తివారివీధిలో మార్వాడీలు, రాజస్థానీయుల హోలీ సంబరాల్లో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి పాల్గొని సందడి చేశారు. యువతలో ఉత్సాహం నింపారు. ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ రాజస్థాన్ మార్వాడీలకు హోలీ అతి ముఖ్యమైన పండగని, కుటుంబ సమేతంగా స్నేహితులతో కలిసి ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. నగర ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మార్వాడీ మహిళలు వారి గృహాల్లో లక్ష్మీదేవికి పూజలు చేశారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజస్థాన్, బెంగాలీ యువకులు హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

విజయ గణపతికి మహా సంప్రోక్షణ



పూజలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీనగర్‌కాలనీ మొదటి లైన్‌లోని విజయ గణపతి ఆలయంలో స్వామివారికి ఫాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కైంకర్యం నిమిత్తం సిద్ధిబుద్ధి సమేత విజయ గణపతికి, పంచలోహ ఉత్సవ విగ్రహాలకు మహా సంప్రోక్షణ కళావాహన కార్యక్రమం, త్రయాహ్నిక దీక్షతో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు మంగళ వాయిద్యాలతో పుణ్యాహవాచనం, విశేష హోమాలు, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. రాత్రి ఏడు గంటలకు స్వామివార్లకు నగరోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: స్థానిక దత్తాత్రేయ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన కట్టా మంగమ్మ అనే వృద్ధురాలి అంత్యక్రియలకు సోమవారం సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. యోగా టీచర్ సునీత సహకారంతో సేకరించిన రూ.10 వేలను అంత్యక్రియలకు అందజేయడంతో పాటు బాధిత కుటుంబం పోషణకు ట్రస్టు ద్వారా రూ.4 వేలను ట్రస్టు సెక్రటరీ సర్దార్‌బాషా అందజేశారు. ప్రతి నెలా పింఛన్ రూపంలో కుటుంబ ఖర్చులకు రూ.4 వేల చొప్పున ఇస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న వీరరాఘవరావు, ముసలారెడ్డి

రంగాయపాలెం (కొత్తపట్నం): మాజీ సర్పంచ్ సింగోతు సుబ్బులమ్మ కుటుంబ సభ్యులకు రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప భర్త ముసలారెడ్డి సోమవారం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు చేతుల మీదుగా అందజేశారు. మాజీ సర్పంచ్ సింగోతు సుబ్బులమ్మ ఈ నెల 8వ తేదీ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం పెద్ద కర్మ సందర్భంగా ఖర్చుల నిమిత్తం సర్పంచ్ సొంత నిధులతో ఆర్థికసాయం అందజేశారు. సుబ్బులమ్మ కోడలు వెంకటేశ్వరమ్మకు ఆ మొత్తాన్ని అందజేశారు. సుబ్బులమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించారు. సర్పంచ్‌గా సుబ్బులమ్మ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముస్లిం జిల్లా మైనార్టీ కార్యదర్శి షేక్ కరిముల్లా, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి గాలి ముసలారెడ్డి, వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు షేక్ అజీమ్, పంచాయతీ వార్డు మెంబర్ కర్రి వెంకటస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ అకీమ్, కన్నా అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ల్యాబ్‌టెక్నీషియన్‌గా రామచంద్రారెడ్డి

మార్కాపురం: మార్కాపురం జిల్లా వైద్యశాలలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కె.రామచంద్రారెడ్డి టీబీ నివారణ దినం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో క్షయ ఎయిడ్స్, లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌కుమార్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను సహోద్యోగులు అభినందించారు.

సంతనూతలపాడు వాసవీ క్లబ్‌లకు సిల్వర్ మెడల్స్



సిల్వర్ మెడల్స్‌తో వాసవీ క్లబ్, మహిళా క్లబ్ సభ్యులను సత్కరిస్తున్న వాసుదేవరావు, సూర్యప్రకాష్

చీమకుర్తి: సంతనూతలపాడులోని వాసవీ క్లబ్, మహిళా క్లబ్‌లకు సిల్వర్ మెడల్స్ వచ్చినట్లు ఆయా క్లబ్‌ల నిర్వాహకులు తెలిపారు. సోమవారం నెల్లూరులో జరిగిన క్యాబినెట్ సమావేశంలో వారికి మెడల్స్ అందించినట్లు చెప్పారు. 2024 సంవత్సరంలో ఇప్పటి వరకు వాసవీ క్లబ్, మహిళా క్లబ్ తరఫున అందించిన సేవలను గుర్తించి సిల్వర్ మెడల్స్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వీ వాసుదేవరావు, మాజీ కోశాధికారి శిద్దా సూర్యప్రకాష్ చేతుల మీదుగా సిల్వర్ మెడల్స్‌కు ఎంపికైన క్లబ్ సభ్యులను ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంతనూతలపాడు వాసవీ క్లబ్ తరఫున వేమూరి ప్రసాద్, గ్రంధి ప్రసాద్, శరత్‌బాబు, పాండురంగారావు, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఒంగోలు మెట్రో: ఫాల్గుణ మాసం పౌర్ణమి లక్ష్మీ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక మంగమూరురోడ్డులోని హరిహరసుత అయ్యప్పస్వామి క్షేత్రంలో సామూహికంగా రమా వసుంధర సమేత సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు పరాంకుశ చక్రవర్తి దంపతుల చేత గణపతి పూజ, మండపారాధన, అభిషేకం, సత్యనారాయణస్వామి అష్టోత్తర పూజ నిర్వహించి స్వామివారి వ్రత కథలను భక్తులకు చక్కగా అర్థమయ్యే విధంగా వివరించారు. అనంతరం హారతి మంత్రపుష్పం నివేదన, తీర్థప్రసాద వితరణగా నిర్వహించారు.



వ్రతంలో పాల్గొన్న దంపతులు

రూ.50 వేలకు మించి నగదు ఉంటే సీజ్

కొమరోలు: సరైన ఆధారాలు లేకుండా 50 వేల రూపాయలకుపైగా నగదు తీసుకెళ్తుంటే ఆ నగదును సీజ్ చేస్తామని గిద్దలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి స్పష్టం చేశారు. మండలంలోని అల్లినగరం చెక్‌పోస్టును ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్లినగరంలోని 2 పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ టీమ్ సభ్యులు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంటారని, 3 బృందాలు ఏర్పడి 15 మంది 24 గంటలూ పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు. నియోజకవర్గంలో 284 పోలింగ్ స్టేషన్లు ఉండగా 56 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లుగా గుర్తించామని, వాటిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరావు, ఎస్సై మధుసూదనరావు పాల్గొన్నారు.